క్లుప్తంగా

వాయిదా పడిన షాపుల బహిరంగ వేలం



బహిరంగ వేలం నిర్వహించేందుకు సమావేశమైన కార్పొరేషన్ రెవెన్యూ అధికారులు

విజయనగరం: స్థానిక రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు ఉన్న షాపుల బహిరంగ వేలం పాటను వాయిదా వేసినట్టు కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్ పివిడి.ప్రసాదరావు తెలిపారు. రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద నూతనంగా నిర్మించిన 22 షాపులకుగాను బహిరంగ వేలం పాటను నిర్వహించేందుకు ఇటీవల ప్రకటన వెలువరించారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వేలం పాటకు ఆసక్తి కలిగిన, తగిన ఆర్థిక స్థోమత కలిగిన అసామీల నుండి ఆశించిన స్థాయిలో సత్వర స్పందన లేనందున పరిపాలన సంబంధ కారణాల రీత్యా వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కేబుల్ వైర్లు

నెల్లిమర్ల: పట్టణంలో కేబుల్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో ప్రైవేటు కేబుల్ ఆపరేటర్లు పాడైపోయిన కేబుల్ వైర్లను ఇష్టానుసారంగా పడేస్తున్నారు. కొత్తగా వేసిన వైర్ల స్థానంలోని పాత వైర్లను తీసుకెళ్లకుండా ఎక్కడివి అక్కడే వదిలేస్తున్నారు. రామతీర్థం జంక్షన్ నుంచి మొయిద జంక్షన్ వరకు, అలాగే రామతీర్థం జంక్షన్ నుంచి రణస్థలం రహదారిలోనూ ఈ విధంగా వైర్లను పడేశారు. దీంతో ఈ రహదారుల్లో వెళ్లే వాహనాలకు, నడిచి వెళ్లేవారి కాళ్లకు వైర్లు చుట్టుకుంటున్నాయి. ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు వైర్లు తగులుకుని ప్రమాదాలకు గురయ్యారు. అయినా ఈ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, సదరు ప్రైవేటు కేబుల్ ఆపరేటర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సారా ప్యాకెట్ల పట్టివేత



పట్టుబడిన సారా ప్యాకెట్లు చూపిస్తున్న ఎస్‌ఐ

సాలూరు: ఒడిశా నుండి సాలూరుకు ద్విచక్ర వాహనంపై సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసామని పట్టణ ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఒడిశా నుండి ద్విచక్ర వాహనంపై సారా ప్యాకెట్లు తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం లావుడికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 150 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బైక్ సీజ్ చేసామని దీనిపై కేసు నమోదు చేసామని అన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



పోలిపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

పూసపాటిరేగ: భోగాపురం మండలం పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆర్‌జేడీ జ్యోతికుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన విద్యా విధానంపై విద్యార్థులకు ఉన్న అవగాహన, పాఠశాలలో జరుగుతున్న నాడు – నేడు పనులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల పరిస్థితి, విద్యార్థులకు తాగునీరు సరఫరా తదితర విషయాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. ఆమెతో పాటు పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

అరుదైన శస్త్రచికిత్స

విజయనగరం ఫోర్ట్: ప్రమాదానికి గురైన 25 ఏళ్ల యువకుడికి సాయి ఆస్పత్రి వైద్యులు శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. దీనికి సంబంధించి ఆస్పత్రి ఎండీ డాక్టర్ అక్కెన శ్రీరామూర్తి విలేకరులకు మంగళవారం వివరాలు వెల్లడించారు. డెంకాడ మండలం బి.తాళ్లవలసకు చెందిన సూరినాయుడు ఇటీవల ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చేరాడు. క్షతగాత్రునికి మల్టిపుల్ ఆర్గాన్స్, మల్టిపుల్ ఫ్రాక్చర్‌తో పాటు లివర్, గాల్ బ్లాడర్ శస్త్ర చికిత్సలు నిర్వహించి ప్రాణం కాపాడామని తెలిపారు. విజయనగరంలో తొలిసారిగా ఇంతటి హైరిస్క్ కేసును ఆస్పత్రి కన్సల్టెంట్ వైద్యులు డాక్టర్ వి.సింధూరి విజయవంతంగా చికిత్స అందించారని చెప్పారు. సాయి ట్రస్టు ద్వారా అతి తక్కువ ఖర్చుతో పూర్తి చికిత్స అందించామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ అక్కెన బాల నాగశ్రీకర్, అక్కెన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



పోలిపల్లిలో లబ్ధిదారుకు బుక్‌లెట్‌లో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ:

పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. భోగాపురం మండలంలోని పోలిపల్లి గ్రామంలో రెండవ రోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముందుగా సుమారు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని ప్రారంభించారు. సర్పంచ్ కర్రోతు వెంకటరమణ సొంత నిధులతో నిరుపేదలకు నిర్మించిన గృహాలను ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలుకుతూ గ్రామంలో ఇంటింటికి తీసుకెళ్లారు. సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి వారు పొందుతున్న లబ్ధిని గూర్చి ప్రతి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నాలుగేళ్లల్లో 99 శాతం అమలు చేశారన్నారు. జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, ఫీజు రీయింబర్స్‌మెంటు నేరుగా లబ్ధిదారులు ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే మంత్రంగా వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ప్రజల్లోకి వెళ్లి ప్రజలు ఆశీస్సులు తీసుకుంటామన్నారు. రాబోయే ఎన్నికలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, ప్రజాప్రతినిధులు పడాల శ్రీనివాసురావు, పడాల భానుప్రకాష్, పతివాడ రామకృష్ణ, కేబుల్ శ్రీనివాసరావు, పిన్నింటి చిన్న, అప్పరభుక్త పైడినాయుడు, చింతపల్లి శ్రీను, సుందర హరీష్, కొండపు కొత్తయ్యరెడ్డి, మైలపల్లి నరిసింహులు, షేక్ మదీనా, కర్రోతు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ సదుపాయాలతో టిడ్కో ఇళ్లు

- కార్పొరేషన్ హౌసింగ్ కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

విజయనగరం: సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించి త్వరలో టిడ్కో ఇళ్లు అందజేసేందుకు అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తున్నట్లు హౌసింగ్ కమిటీ సభ్యులు వెల్లడించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో హౌసింగ్ కమిటీ, నగరపాలక సంస్థ మరియు హౌసింగ్ అధికారులతో మంగళవారం సమావేశం అయింది. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు అందజేయడంలో నెలకొన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

వాటి పరిష్కారానికి సత్వరంగా చొరవ చూపాలని అధికారులకు ఆదేశించారు. లబ్ధిదారులకు రుణ సదుపాయం అందే విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకొని నేరుగా బ్యాంకర్లతో మాట్లాడాలని అధికారులకు సూచించారు. సమావేశాన్ని ఉద్దేశించి ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ నగరంలో సారిపల్లి, సోనియానగర్ ప్రాంతాలలో టిడ్కో ఇళ్లు రూపుదిద్దుకున్నాయన్నారు. సారిపల్లెలో 157, సోనియానగర్ లో 147 ఇళ్లకు సంబంధించి వివిధ రకాల కారణాలతో లబ్ధిదారులకు అందజేయడంలో ఆలస్యం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రుణ సదుపాయం అందక, కొంతమంది అందుబాటులో లేకపోవడం వల్ల ఇళ్లను అందించడంలో జాప్యం జరుగుతుందన్నారు. అన్ని సమస్యలను పరిష్కరించి లబ్ధిదారులకు త్వరితగతిన ఇల్లు అందజేసే ఏర్పాట్లు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హౌసింగ్ కమిటీ సభ్యుడు గాదం మురళి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం కారణంగా టిడ్కో ఇళ్ల మంజూరులో తీవ్ర జాప్యం ఏర్పడిందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచనల మేరకు నివాసయోగ్యమైన ఆవాసాలుగా తయారుచేసి అందించేందుకు సిద్ధమవుతున్నామన్నారు. సమావేశంలో హౌసింగ్ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

'గౌ(్రి)పాటి' విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

విజయనగరం అర్బన్: జిల్లాలోని తాటిపూడి రిజర్వాయరుకు దివంగత గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీఓ విడుదల చేయడం హర్షణీయమని, రిజర్వాయరు ప్రాంగణంలో గొర్రిపాటి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఆంధ్ర కొప్పుల వెలమ సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఉమ్మడి విశాఖ (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం) జిల్లా బోర్డుకు మొట్టమొదటి చైర్మన్‌గా గొర్రిపాటి బాధ్యతలు చేపట్టి ఉత్తరాంధ్ర అభివృద్ధికి అడుగులు వేసారని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించి ఆయన పేరును పెట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆంధ్ర కొప్పుల వెలమ సంక్షేమ సంఘం ధన్యవాదాలు తెలిపారు. సంఘం సొంత ఖర్చుతో గొర్రిపాటి విగ్రహాన్ని నిర్మించదలచామని, అందుకు అనువైన స్థలాన్ని జలాశయం ప్రాంగణంలో కేటాయించవలసినదిగా సంబంధిత శాఖకు ఆదేశించాలని కోరారు. చైర్మన్‌ని కలిసిన వారిలో సంఘం గౌరవ అధ్యక్షుడు కొరుపోలు సత్యారావు, కన్వీనర్ కూనిరెడ్డి శ్రీనివాస్, అధ్యక్షుడు బొమ్మినాయుని తిరుపతినాయుడు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఉన్నతే ప్రభుత్వ లక్ష్యం

- నగర పంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని



జేవీకే కిట్లు అందజేస్తున్న చైర్‌పర్సన్ సరోజిని తదితరులు

నెల్లిమర్ల: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ లక్ష్యమని నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్‌చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు అన్నారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక కౌన్సిలర్ చిక్కాల సంతోష్‌కుమార్‌తో కలిసి చైర్మన్, వైస్‌చైర్మన్ జగనన్న విద్యా కానుక కిట్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫాం, బూట్లు, బెల్టులు, బ్యాగ్, డిక్షనరీ తదితర సామగ్రిని ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తోందన్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా ఉదయం రాగిజావతో వేరుశనగ చిక్కీలు, మధ్యాహ్నం పోషకాలతో కూడిన భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను అందిపుచ్చుకుని, విద్యార్థులంతా చక్కగా చదువుకోవాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం శారద ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ ఎస్.సూర్యకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్ చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు.

జరజాపుపేటలో..

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జేవీకే కిట్లను వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, హెచ్‌ఎం ఎస్.జగదీశ్వరరావు తదితరులు మంగళవారం పంపిణీ చేశారు. కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని వారు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తుమ్ము భారతి, పాండ్రంకి సత్యవతి, నల్లి కృష్ణవేణి, కో ఆప్షన్ సభ్యురాలు మాత సంధ్య, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కె.విజయ్‌కుమార్, నల్లి శ్రీనివాసరావు, కనకల హైమావతి, తుమ్ము నారాయణమూర్తి పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

- ఎమ్మెల్యే బడ్డుకొండను సన్మానించిన కాంట్రాక్ట్ ఉద్యోగులు



ఎమ్మెల్యే బడ్డుకొండ సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘం నాయకులు

డెంకాడ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులు మంగళవారం పాలాభిషేకం చేశారు. తమను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రెగ్యులర్ చేయడంపై భోగాపురం తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు చెందిన కాంట్రాక్ట్ ఉద్యోగులు మోపాడలో నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. తమ కష్టాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి రెగ్యులర్ చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. తమ కుటుంబాల్లో సంతోషాన్ని నింపారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు కాంట్రాక్ట్ కార్మికులు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ అధ్యక్షుడు కొమ్మూరి దుర్గారావు, కార్యదర్శి సంతోష్, కాంట్రాక్ట్ ఉద్యోగుల ప్రతినిధులు బంగారుబాబు, గోవిందరావు, సీతరాజు, సత్యనారాయణ, రవి, శంకర్, ఉమాసుందరి, నాగేశ్వరరావు, భాస్కర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రుల పాదుకలకు ప్రత్యేక పూజలు



సీతారామచంద్రుల పాదుకలకు పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్త నారాయణం శ్రీనివాస్ దంపతులు

విజయనగరం టౌన్: టీటీడీ కల్యాణ మండపంలోని వేంకటేశ్వరాలయంలో పవిత్ర శ్రీరామపాదుకలకు మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజలు జరిగాయి. సుమారు 8 కిలోల వెండితో అయోధ్యలో నిర్మిస్తున్న శ్రీ సీతారామచంద్రుల పాదుకలకు శృంగేరి జగద్గురువులు కొన్ని నెలల పాటు నిత్య పూజలు చేశారని ఎన్‌సీఎస్ ట్రస్ట్, ఆలయ ధర్మకర్త నారాయణం శ్రీనివాస్ తెలిపారు. 108 పుణ్యక్షేత్రాలలో పూజలు చేసిన అనంతరం అయోధ్య సీతారాముల ఆలయానికి ఈ పాదుకలను సమర్పించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఇక్కడి టీటీడీ కల్యాణ మండపంలోని వేంకటేశ్వరాలయం పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం భక్తులు విచ్చేసి పాదుకలను తాకి స్పర్శ దర్శనాలు చేసుకున్నారు.

జగనన్న పాలనలో సంతృప్తికరంగా ప్రజలు

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయ

విజయనగరం: ప్రభుత్వ పథకాల అమల్లో ప్రజాస్పందనతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చక్కటి వేదికగా నిలుస్తుందని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. స్థానిక 26వ డివిజన్ కోరాడవీధిలోని మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమల్లో లంచగొండితనం, మధ్యవర్తులు ప్రమేయం లేకుండా అందజేయటం జరుగుతుందన్నారు. స్థానిక సమస్యలు తెలపాలని కోరారు. ఇంటింటికి వెళ్తుంటే లబ్ధి పొందిన గృహస్తులు ఆమెను సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ గడప గడపకు వెళ్తుంటే జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. జోనల్ ఇన్‌చార్జ్ గుజ్జల నారాయణరావు మాట్లాడుతూ నగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పట్ల ప్రజాస్పందన అనూహ్యంగా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రసాదరావు, డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎవర్ణ కుమారస్వామి, పూసర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల సేవలో డిప్యూటీ మేయర్ శ్రావణి



విగ్రహ శంకుస్థాపనకు పూజలు చేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి దాసన్నపేటలోని ఏనుగుల తోట వద్ద వేంచేసిన శ్రీ మహాకాళేశ్వర సహిత కాళికాదేవి అమ్మవార్ల 11వ ఆలయ వార్షికోత్సవంలో మంగళవారం పాల్గొన్నారు. తొలుత ఆలయ ఆవరణలోని సుమారు 26 అడుగుల అభయాంజనేయ స్వామి వారి విగ్రహ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అనంతరం కాళికాదేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ పెద్దలు ఆమెకు సాదర స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనాలు అందజేశారు.

నల్ల మారమ్మ తల్లిని దర్శించుకున్న డిప్యూటీ మేయర్ బాబామెట్ట డబుల్ కాలనీలో కొలువైన నల్లమారమ్మ తల్లి పండగ మహోత్సవంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, ఆలయ కమిటీ పెద్దలు ఆమెకు సాదర స్వాగతం పలికారు.

కోట సత్తెమ్మతల్లిని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్



కోట సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: నగరంలోని రామారాయుడు రోడ్‌లో వేంచేసి ఉన్న కోట సత్తెమ్మ తల్లిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మంగళవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. తల్లి వార్షిక మహోత్సవాలలో భాగంగా ఉత్సవ కమిటీ అమ్మవారిని కొలువుదీర్చారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న వార్షిక మహోత్సవాలలో అమ్మవారి ఆశీస్సులను పొందేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు మరియు కోట సత్తెమ్మతల్లి ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. పూర్ణ కుంభంతో వేదమంత్రోచ్చరణల నడుమ అమ్మవారి దర్శనం భాగ్యాన్ని కల్పించారు. ప్రత్యేక పూజలు అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేశారు. కోట్ల సత్తెమ్మతల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరి పైన ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆచి సూర్యప్రకాశరావు, తంగుడు ఆనందరావు, ఒబ్బిలి శెట్టి ఏడుకొండలు, పశుపతి, కోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘోషాస్పత్రికి 5 ఏసీల వితరణ



ఘోషాస్పత్రికి ఏసీ యంత్రాలు అందజేస్తున్న భవన నిర్మాణ యజమానులు

విజయనగరం: జిల్లా కేంద్రంలో ఉన్న ఘోషాస్పత్రికి అవసరమైన 5 ఏసీ యంత్రాలను భవన నిర్మాణ సంస్థ యజమానులు ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడుకు, నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రసాదరావు సమక్షంలో అందజేశారు. వాస్తవానికి ఘోషాస్పత్రిలో యంత్రాలు లేక నవజాత శిశువులు, గర్భిణులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వైనాన్ని తెలుసుకున్న కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ సూచన మేరకు నగరపాలక సంస్థ అధికారులు నగరంలో ఉన్న భవన నిర్మాణ యజమానులకు సహకరించవలసిందిగా కోరారు. దీంతో ముందుకు వచ్చిన లాస్ డెవలపర్స్, ఎస్.నారాయణరావు, జి.సురేష్, ఎన్.శేఖర్, శివాజీ వర్మ, కేదారిశెట్టి సీతారామమూర్తి తమ వంతు సహాయంగా ఒక్కొక్క ఏసీ చొప్పున 5 ఏసీ యంత్రాలను అందజేశారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ చాంబర్‌లో ఏసీ యంత్రాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పలనాయుడుకు అందజేశారు. రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అడిగిన వెంటనే శీతలీకరణ యంత్రాలను అందజేసిన భవన నిర్మాణ యజమానులకు కమిషనర్ ప్రసాదరావు అభినందనలు తెలిపారు.

ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రసాదరావు

విజయనగరం: రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతాంశంగా స్వీకరించి సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని సచివాలయ కార్యదర్శులకు, సిబ్బందికి ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రసాదరావు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగంలో వస్తున్న ఫిర్యాదుల పరిష్కారానికి నెలకొంటున్న క్షేత్ర స్థాయి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళిక విభాగంలో ఇకపై జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. వచ్చిన ఫిర్యాదులను కాల పరిమితిలోగా పరిష్కరించాలని చెప్పారు. వీటిపై సంబంధిత డీఈలు, ఏఈలు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. సమావేశంలో ఈఈ కే.శ్రీనివాసరావు, డీఈ అప్పారావు, ఏఈలు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో వైర్‌లెస్ కమ్యూనికేషన్‌ది కీలకపాత్ర

- రావూస్ కన్సల్టెంట్స్ అమెరికా సీఈఓ డాక్టర్ సుధాకర్‌రావు



మాట్లాడుతున్న రావూస్ కన్సల్టెంట్స్ అమెరికా సీఈఓ డాక్టర్ సుధాకర్‌రావు

విజయనగరం అర్బన్: దేశాభివృద్ధికి కీలకపాత్ర వహించిన రంగాల్లో వైర్‌లెస్ కమ్యూనికేషన్ విద్య ముందు వరుసలో ఉందని అమెరికాకు చెందిన రావూస్ కన్సల్టెంట్స్ సీఈఓ డాక్టర్ సుధాకర్‌రావు అన్నారు. స్థానిక దాకమర్రిలోని రఘు విద్యాసంస్థల కళాశాలలో 'అడ్వాన్సెస్ ఇన్ వైర్‌లెస్ కమ్యూనికేషన్స్ అండ్ ఏంటినా టెక్నాలజీస్ ఫర్ స్పేస్' అంశంపై మంగళవారం జరిగిన ఒక రోజు అంతర్జాతీయ వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధికి వైర్ లెస్ కమ్యూనికేషన్‌లో మరిన్ని పరిశోధనలు రావాలని, ఆ దిశగా విద్యార్థులు ఉత్సాహం చూపాలని సూచించారు. కళాశాల విభాగాధిపతి ప్రొఫెసర్ పి.సతీష్‌రామ చౌదరి సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో అమెరికా, టర్కీ, తైవాన్, భారత్ దేశాలకు చెందిన సాంకేతిక నిపుణులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, ఆచార్యులు భాగస్వాములను చేస్తూ ప్రత్యక్షజ్ఞానాన్ని అధునాతన సాంకేతికతలను పలువురు పరిచయం చూస్తూ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన క్వాడ్జెస్ వైర్‌లెస్ సంస్థ సీఈఓ సీఎస్‌రావు, నాసా సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ నసీర్ చాహల్, తైవాన్ వర్సిటీ ప్రొఫెసర్ డెన్మండ్ సిమ్, అమెరికా ఏంటినా ఇంజినీర్ డాక్టర్ గౌరంగి గుప్త, టర్కి వర్సిటీ ప్రొఫెసర్ లివెంట్సెగ్గి, జేఎన్‌టీయూ అనంతపూర్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి వివిధ అంశాలపై సదస్సులో ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాలకు చెందిన వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల ధర్నా



దర్నా చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు

విజయనగరం ఫోర్ట్: తమ సమస్యలు పరిష్కరాలని కోరుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సిబ్బంది స్థానిక కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పీఏసీఎస్ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలన్నారు. డీసీసీబీలో తక్షణమే రాష్ట్ర స్థాయి మద్దతు నిధి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కామేశ్వరావు, రామ్మూర్తి, రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: మహారాజ కళాశాలలో ఫైనల్ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు ముందుగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మహారాజ కళాశాల ప్రిన్సిపల్ సాంబశివరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రమేష్, తదితరులు పాల్గొన్నారు.